క్లుప్తంగా

శివాలయంలో చండీ హోమం



చండీ హోమం చేస్తున్న దంపతులు

గుర్ల: మండల కేంద్రంలోని శివాలయంలో అర్చకులు ఆరవెల్లి సురేష్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. 50 మంది దంపతులు పూజల్లో పాల్గొన్నారు. లోక కల్యాణార్థం హోమం, ప్రత్యేక పూజలు చేశామని అర్చకులు తెలిపారు.

నేడు 'స్పందన'

దత్తిరాజేరు: ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీ ఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని సూచించారు. అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

17న ద్విచక్ర వాహనాల వేలం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో మద్యం అక్రమ రవాణా కేసులో సీజ్ చేసిన రెండు టీవీ ఎస్ ఎక్సెల్ వాహనాలను ఈనెల17న వేలం పాట వేయనున్నట్లు ఎస్ఐ శిరీష ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆరోజు గజపతి నగరం సర్కిల్ కార్యాల యంలో ఉదయం 10:30 గంటలకు నిర్వహించే వేలం పాటలో పాల్గొనవచ్చని చెప్పారు.

పంటల వివరాలను ఈ- క్రాప్‌లో నమోదు చేయాలి

వేపాడ: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండల రైతులు తాము సాగుచేస్తున్న వరి, ఇతర పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏఓ సి.బి.యశ్వంతరావు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. రైతులు ఆధార్ కార్డు జెరాక్స్, భూమి పాసుపుస్తకం, మొబైల్ ఫోన్ నంబర్‌తో తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ–క్రాప్‌లో నమోదైతేనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటను కొనుగోలు చేస్తారని, ప్రకృతి వైపరీత్యాలకు పంటకు నష్టం వాటిల్లితే ప్రభుత్వ పరిహారం చెల్లిస్తుందని తెలిపారు. రైతులు అంతా తప్పనిసరిగా ఈ–క్రాప్ చేయించుకోవాలని కోరారు.

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: ఎస్.భూర్జవలసలో ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించా రు. వాహనాల పత్రాలు, లెసెన్స్‌లు పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్లే చాలా మంది యువకులు ప్రమాదాల బారినపడుతున్నారని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే, సంబంధిత వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్, వాహనాల పత్రాలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు.

ఊరటనిచ్చిన వర్షం

బొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలు సమయంలో కురిసిన వర్షం రైతులు, ప్రజలకు ఊరటనిచ్చింది. వారం రోజులుగా ఎండలు పెరగడంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. వర్షంతో వాతావరణం చల్లబడి, ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. బొండపల్లి, అంబటివలస, గరుడుబిల్లి, వేంద్రాం, ఒంపల్లి తదితర గ్రామాల్లో వర్షం సుమారు అర్ధగంట పాటు వర్షం కురిసింది. వరినాట్లకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్లు, యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అతివేగం కన్నా ప్రయాణికుల భద్రత ముఖ్యమన్నారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. రహదారి భద్రత నియమాలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థిక సాయం

భోగాపురం: మండలంలోని మహారాజుపేట గ్రామానికి చెందిన గుడ్ల లక్ష్మి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. పేద కుటుంబం కావడంతో వైద్యం చేయించుకునేందుకు ఇబ్బంది పడుతున్న విషయం గమనించిన గ్రామానికి చెందిన పెద్దలు, యువత నగదు సాయం చేశారు. ఎంఎస్ఎన్ రాజు, రాజు మాస్టార్ల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి లక్ష రూపాయలను ఆదివారం అందజేశారు. వెంకటరావు, గుర్నాథ్, సతీష్, గ్రాస్తులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడి

- వరిలో తెగుళ్లను సకాలంలో గుర్తించి, నివారించాలి
- ఏఓ శ్యామ్‌కుమార్



వసాది గ్రామంలో సాగులో ఉన్న వరి

గంట్యాడ: సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు సాధ్యమని, పంటను ఆశించే తెగుళ్లను రైతులు సకాలంలో గుర్తించి, జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.శ్యామ్‌కుమార్ సూచించారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరిసాధారణ సాగు విస్తీర్ణం 3వేల హెక్టార్లు కాగా ఇప్పటికే 2 వేల హెక్టార్లలో వరి ఉబాలు పూర్తయ్యాయని చెప్పారు. వరి పంటను ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు ఆయన పలు సూచనలు చేశారు.

ఆకుమచ్చ తెగులు: గొంగలి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని గోకి తినవేయడం వల్ల ఆకులు తెల్లబడతాయి. పంట పిలక దశలో చేనుకు అడ్డంగా తాడుతో 2, 3 సార్లు లాగితే పురుగులు కింద పడిపోతాయి. వీటి నివారణకు క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటికి కలిపి ఎకరానికి 200 లీటర్లు పిచికారీ చేయాలి.

సుడిదోమ: వరి పంట అంకురం దశ నుంచి చిరు పొట్ట దశలో ఉన్నప్పుడు సుడిదోమ ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

గోదుమ వర్ణపు దోమలు దుబ్బులు అడుగున నీటి మట్టంపై ఉండి మొక్క రసాన్ని పీలుస్తాయి. దీని వల్ల పైరు సుడులు తిరిగి ఎండిపోతుంది. ఉబాలు చేసేటప్పుడే ప్రతీ రెండు మీటర్ల పొడవుకు 20 సెంటీమీటర్ల వెడల్పుతో బాటలు వదలాలి. పంటలో దోమ ఉధృతి ఎక్కువైనప్పుడు లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల ఇథోఫెన్‌ప్రాక్స్ మందును కలిపి పిచికారీ చేయాలి.

తుప్పు తెగులు: నేలలో జింక్ లోపం ఉన్నప్పుడు పంటను తుప్పు తెగులు ఆశిస్తుంది. నాట్లు వేసిన 2 నుంచి 6 వారాల్లో ఆకు చివరలో ఈనెకు ఇరుపక్కలా తుప్పు లేక ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు చిన్నవిగా పెలుసుగా మారిపోయి , వాటిని వంచగానే విరిగిపోతాయి. మొక్కలు గిడసబారి దుబ్బు చేయవు. పైరుకు జింక్ లోపం కనిపించగానే జింక్ సల్ఫేట్ కలిపి అయిదు రోజుల వ్యవధిలో రెండు లేక మూడు సార్లు పిచికారీ చేయాలి.

కాండం కుళ్లు తెగులు: ఆకుతొడిమపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి.లోపలి కాండానికి విస్తరించి కణుపుల మధ్య భాగ మంతా నల్లగా మారిపోతుంది. కాండం చీల్చి చూస్తే తెల్లని లేదా నల్లని శిలింధ్రాల బీజాలు కనిపిస్తాయి. గింజ పాలుపోసుకునే దశ నుంచి గట్టిపడే వరకు ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. తాలు గింజలు ఏర్పడి 30 నుంచి 80 శాతం పంట నష్టపోయే అవకాశం ఉంది. తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే లీటరు నీటికి 2 మిల్లీలీటర్ల థయాఫానేట్ మందును కలిపి పిచికారీ చేయాలి.

పాముపొడ తెగులు: చేను దుబ్బు చేసే దశలో ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేణా పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. ఉధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు చనిపోతాయి. నివారణకు ఒక మిల్లీలీటర్ ప్రొపికొనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారిచేయాలి.

అగ్గితెగులు: ఈ తెగులు సోకినప్పుడు ముదురు ఆకులపై నూలు కండె ఆకారంలో గోదుమరంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎర్రబడతాయి. నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారిచేయాలి.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు

లక్కవరపుకోట: స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని మండలంలోని జమ్మాదేవిపేట గ్రామసమీపంలోని జ్యోతిరావుపూలే గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆటల పోటీలు ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో ఆధ్వర్యంలో విద్యార్థినులకు రన్నింగ్, మ్యూజిక్ చైర్, కబడ్డీ, ఖోఖో, చదరంగా తదితర ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం నాడు బహుమతులను ప్రదానం చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

15మంది జూదరుల అరెస్ట్

వేపాడ: మండలంలోని రామస్వామిపేట క్వారీల సమీపంలో జూదం (ఏట్లాట) ఆడుతున్న 15 మందిని అరెస్టు చేశామని వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తెలిపారు. జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఏట్లాట శిబిరంపై వల్లంపూడి, ఎస్.కోట, ఎల్.కోట స్టేషన్ల పోలీసులు ఆదివారం దాడులు చేశారు. జూదం ఆడుతున్న వారి నుంచి రూ. 58,020 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజేష్ చెప్పారు.

ప్రారంభానికి సిద్ధం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయ, రైతుభరోసా కేంద్రం భవనాలు

చీపురుపల్లి: మండలంలోని జి.ములగాం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిని త్వరలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులు మీదుగా ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఏర్పా ట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామసచివాలయ వ్యవస్థతో గ్రామాల్లోనే ప్రజలు అన్ని ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. గతంలో మండల కేంద్రానికి వెళితే తప్ప ప్రభుత్వ సేవలు లభించేవి కావు. కానీ నేడు ఉన్న ఊళ్లలోనే ప్రభుత్వ సేవలన్నీ లభిస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటుదాం



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ప్లాంట్ ఫర్ ఫ్యూచర్ సంస్థ ప్రతినిధులు



దేవీ జంక్షన్‌వద్ద మానవహారం

శృంగవరపుకోట: భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందించేందుకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత మ నందరిపై ఉందని ప్లాంట్ ఫర్ ఫ్యూచర్ సంస్థ కన్వీనర్ వి.ఈశ్వర రావు అన్నారు. ఆసంస్థ ఆధ్వర్యంలో ఎస్.కోట పట్టణంలో విద్యార్థులతో కలిసి ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దేవీ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. మొక్కలను పెంచుదాం..ఆక్సిజన్ అందిద్దాం అంటూ నినాదాలు చేశారు. అంతకుముందు భవానీ ఐటీఐ వద్ద అటవీ శాఖ అధికారులకు ప్లాంట్ ఫర్ ఫ్యూచర్ సంస్థ వెయ్యి మొక్కలు అందజేయడంతో పాటు పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ప్లాంట్ ఫర్ ఫ్యూచర్ సంస్థ సభ్యులు మండ సత్యసాహితి, జామి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం..పరిశుభ్రత అందరి బాధ్యత



ట్రాక్టర్‌తో రోడ్డుకిరువైపులా ఉన్న తుప్పల తొలగింపు పనులు చేయిస్తున్న యువకులు



మరుపల్లిలో రోడ్డు పక్కన మొక్కలు నాటుతున్న గ్రామస్తులు,యువత

గజపతినగరం: పచ్చదనం కోసం మొక్కలు నాటడం, వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యంగా ఉండేందుకు పరిశుభ్రత పాటించడం అందరి బాధ్యత అని న్యాయవాది శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మరుపల్లి గ్రామంలో ప్రజలు, యువత ఆదివారం పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు ఉన్నత పాఠశాల, కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు వెళ్లే రోడ్లలో మొక్కలు నాటారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న తుప్పలను ట్రాక్టర్‌తో తొలగించారు.

నైట్ స్టార్మింగ్‌తో నేరాలకు చెక్

- సీఐ వెంకటరావు



పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: రాత్రి వేళల్లో విచ్చలవిడిగా సంచరించడం, బైక్ రేస్‌లు, డ్రంకన్ డ్రైవ్, గంజాయి అక్రమ రవాణాను నిర్మూలించేందుకు ఇకపై ఆకస్మికంగా నైట్ స్టార్మింగ్ చేపడుతున్నామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం రాత్రి గంటస్తంభం వద్ద ప్రత్యేక అవగాహన కల్పించడంతో పాటు 35 రాత్రి బీట్లతో గస్తీ ముమ్మరం చేశారు. ఎక్కడికక్కడ వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరావు మాట్లాడుతూ, ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు డీఎస్పీ ఆర్.గోవింద రావు నేతృత్వంలో 12 మంది ఎస్సైలు, 70 మంది పోలీసు సిబ్బంది నైట్ స్టార్మింగ్‌లో పాల్గొని గస్తీ ముమ్మరం చేశామన్నారు. 22 డ్రంకన్ డ్రైవ్ కేసులు, పది మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేయడంతో పాటు వాహన రికార్డులు సక్రమంగా లేని రెండు వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. పట్టణంలో కారణం లేకుండా అర్ధరాత్రి సమయాల్లో తిరిగే యువతపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు అశోక్ కుమార్, భాస్కరరావు, మురళి, రామగణేష్, షేక్ శంకర్, ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీలు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న పట్టాభిరాం పండిట్

విజయనగరం టౌన్: నగరంలోని కొత్తపేట మంటపం వద్దనున్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఆదివారం నిర్వహించిన సంగీత కచేరీలు ఆద్యంతం ఆహూతులను అలరించాయి. బెంగళూరుకు చెందిన పట్టాభిరాం పండిట్ గాత్ర కచేరీ ఆద్యంతం అలరించింది. చెన్నైకి చెందిన మంథా శ్రీరమ్య వయోలిన్‌పైన, విజయవాడకు చెందిన కె.సద్గురు చరణ్, కంజీరాపై రవి సహకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సంగీతాభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్ల అమ్మకం తగదు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ నూతనంగా ప్రారంభిస్తున్న వైద్య కళాశాలల్లో సీట్లను అమ్మే విధానాన్ని మానుకోవాలని జనవిజ్ఞాన వేదిక నగర మహాసభలో సభ్యులు తీర్మానం చేశారు. ఆదివాకం స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సిబ్బంది సమావేశ మందిరంలో జరిగిన మహాసభలో పలువురు మాట్లాడుతూ, సీట్ల అమ్మకం వల్ల పేద విద్యార్థులకు నష్టం కలుగుతుందన్నారు. నగర కమిటీ అధ్యక్షుడు కె.మురళీబాబు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో గ్రంథాలయాల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధి నుంచి కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నట్లు వస్తున్న ప్రచారం ఆందోళన కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎంవీఎన్ వెంకటరావు, పి.రమణప్రభాత్, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, సమతా మహిళా విభాగం జిల్లా కన్వీనర్ జి.నిర్మల, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగర కమిటీ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు వి.రాజగోపాల్ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించిన ఎన్నికలో కమిటీ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఎల్.చిన్నారి, ప్రధాన కార్యదర్శిగా కె.శశిధర్, కోశాధికారిగా సీహెచ్.సింహాచలం, ఉపాధ్యక్షులుగా జి.నిర్మల, ఆర్.మహేష్, ఎం.ప్రసాద్, కార్యదర్శులుగా దిలీప్ చక్రవర్తి, సతీష్, చంద్రశేఖర్, మరో ఏడుగురు కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చంద్రశేఖర్ కన్వీనర్‌గా 13 మందితో యూత్ కమిటీ, జి.నిర్మల కన్వీనర్‌గా 20 మందితో సమతా మహిళా కమిటీని ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యేగా గెలిచి మాట్లాడు..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- 2024లో ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటారా..?
- టీడీపీ నేత నాగార్జునకు వైఎస్సార్‌సీపీ నాయకుల సవాల్

చీపురుపల్లి: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను విమర్శించే స్థాయి, అర్హత టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆ పార్టీ చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కిమిడి నాగార్జునకు లేదని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చీపురుపల్లిలో 2024లో మంత్రి బొత్సపై నాగార్జున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన తర్వాత మాట్లాడాలని అన్నారు. 2024లో నాగార్జున గెలిస్తే మూడు రోడ్ల జంక్షన్‌లో ప్రజల సమక్షంలో తాము గుండు గీయించుకుని రాజకీయాలు నుంచి తప్పుకుంటామని, అదే ఆయన ఓటమి చెందితే గుండు గీయించుకుని రాజకీయ సన్యాసం తీసుకుంటారా అని సవాల్ విసిరారు. ఏదో రాష్ట్ర స్థాయి నేతలా మాట్లాడుతున్న నాగార్జునకు దమ్ముంటే తమ సవాల్ స్వీకరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ రాజారావు, రఘుమండ త్రినాథ్, ప్రభాత్‌కుమార్, పొంద్రంకి వాసు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఆశయ రమణ

చీపురుపల్లి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. నామట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా జి.అగ్రహారంలో ఆదివారం మొక్కలు పంపిణీ చేయడంతో పాటు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రభుత్వం 'నామట్టి–నా దేశం' కార్యక్రమం నిర్వహిస్తోందని, అందులో భాగంగానే మొక్కలు పంపిణీ చేశామన్నారు. అలాగే దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన వీరుల గురించి విద్యార్థులు, యువత తెలుసుకోవాలన్నారు.

అమ్మవార్లకు అభిషేకాలు



చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు



బొండపల్లి: రాజరాజేశ్వరీదేవిని దర్శించుకుంటున్న భక్తులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు.

రాజరాజేశ్వరీదేవి ఆలయంలో...

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పీఏసీఎస్‌ల బలోపేతానికి చర్యలు



డిపాజిట్‌దారులకు బాండ్లు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రమణ, డీసీసీబీ మేనేజర్ సతీష్‌రాజు

బొండపల్లి: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్‌లు) బలోపేతానికి, అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని, రైతులకు, వ్యాపారులకు రుణాలు ఇవ్వడంతో పాటు డిపాజిట్ల సేకరణకు అనుమతులు ఇచ్చిందని గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ తెలిపారు. గొట్లాం పీఏసీఎస్‌లో ఆదివారం ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.6 లక్షలు డిపాజిట్ సేకరించి వారికి బాండ్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గొట్లాం పీఏసీఎస్ పరిధిలో ఇంత వరకు రూ.73 లక్షల డిపాజిట్లు సేకరించామని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహంతో పాటు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సహాయ సహకారాలతో పీఏసీఎస్‌ను ప్రగతిపథంలో నడిపించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ ద్వారా 2019 నుంచి 2023 మధ్య పలువురికి వ్యాపారాల నిమిత్తం రూ.8 కోట్లు రుణం అందించడంతో పాటు 90 శాతం రికవరీ చేశామని చెప్పారు. వి.టి అగ్రహారం డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ సతీష్ రాజు, సూపర్‌వైజర్ వెంకటరమణ, పీఏసీఎస్ సీఈఓ నాయుడు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

విజయనగరం ఫోర్ట్: అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సాయి ఆస్పత్రి ఎం.డి డాక్టర్ అక్కెన శ్రీరామ్మూర్తి అన్నారు. ప్రపంచ అవయవదానోత్సవం సందర్భంగా నర్సింగ్ విద్యార్థులు జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైద్యశాస్త్రం అభివృద్ధి చెందడం వల్లే అవయవ దానానికి అవకాశం ఏర్పడిందని చెప్పారు. అవయవ దానం వల్ల మరొకరికి జీవితాన్ని ప్రసాదించే అవకాశం దాతకు కలుగుతుందని తెలిపారు. రామ్మూర్తి మాట్లాడుతూ, విజ్ఞానవంతమైన సమాజంలో ప్రతి ఒక్కరూ అవయవదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో త్యాడ ప్రసాద్, వేణుగోపాలం, శ్రీనివాస్, తనీష్, మనోజ్, సాయి, రామకృష్ణ పాల్గొన్నారు.

అవయవదానం ప్రాణదానంతో సమానం..

విజయనగరం: ఒక వ్యక్తి చేసే అవయవదానంతో ఎనిమిది మందికి ప్రాణదానం చేయవచ్చని ప్రముఖ వైద్యుడు ఎ.శ్రీరామమూర్తి అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా మదర్ థెరీసా సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యన్నపేట జంక్షన్ వద్ద గల థెరీసా కిడ్స్ క్లబ్‌లో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ.శ్రీ